క్లుప్తంగా

దుర్గగుడి ఈఓ భ్రమరాంబకు సత్కారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఈఓ భ్రమరాంబను చైర్మన్ కర్నాటి రాంబాబు శుక్రవారం శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. దుర్గగుడి ఈఓగా బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈఓను సత్కరించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఈఓ చాంబర్‌లో ఆమెను సత్కరించారు. అనుభవం కలిగిన అధికారిగా ఈఓ భ్రమరాంబ దేవస్థానాన్ని అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. రానున్న రోజుల్లో దేవస్థానాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ఈఓతో కలిసి పని చేస్తామని చెప్పారు. చైర్మన్ వెంట పాలక మండలి సభ్యుడు బుద్దా రాంబాబు ఉన్నారు.

20న సివిల్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఈ నెల 21వ తేదీన నేషనల్ సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు ఈ నెల 20న సివిల్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్‌ను నిర్వహిస్తున్నట్లు ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ ప్రకటనలో తెలిపారు. సమాజానికి సేవ చేయాలనే లక్ష్యం ఉండి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న రెండు తెలుగు రాష్ట్రాల్లోని యువత ఈ ఆన్‌లైన్ పరీక్షకు హాజరుకావచ్చన్నారు. పరీక్ష సిలబస్, రిజిస్ట్రేషన్ వివరాలకు 86862 33879 నంబరులో సంప్రదించాలన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): గుడ్ ఫ్రైడే సందర్భంగా పెజ్జోనిపేటలోని పలు చర్చిలకు వచ్చిన భక్తులకు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొలిమెట్ల శరత్‌బాబు ఆధ్వర్యంలో ఎస్సీ సెల్ నాయకులు శుక్రవారం మజ్జిగను పంపిణీ చేశారు. ఆర్సీఎం చర్చి, సీఎస్ఐ, తెలుగు బాప్టిస్ట్ చర్చిలకు వచ్చిన క్రైస్తవులకు మజ్జిగను అందించారు. అనంత్, సంగీత్‌బాబు, వినోద్ పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రాల అందజేత



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక శ్రీవెంకట సాయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు 'స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను బహూకరించారు. పసుపులేటి రవికాంత్ మాతృమూర్తి రాజకుమారి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన శుక్రవారం వస్త్రాలు పంపిణీతో పాటు భోజనం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ.. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 10 మాసాల్లో దాతల ఆర్థిక సహకారంతో తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో 23 సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో దాతలు దేవి సుకన్య, షేక్ చాంద్ బాషా, శ్రీనివాసరావు, సీహెచ్ ప్రభాకరరావు, సూర్యకుమారి, స్వర్ణలత, వృద్ధాశ్రమ నిర్వాహకులు నాగరాజు పాల్గొన్నారు.

మోతీ మస్జీద్‌లో ఇఫ్తార్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ శుక్రవారం చిట్టినగర్ మోతీ మస్జీద్‌లో ఇఫ్తార్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇఫ్తార్ ప్రార్థనలకు విచ్చేసిన ఆసిఫ్‌ను మోతీ మస్జీద్ కమిటీ ప్రతినిధులు సాదరంగా స్వాగతం పలికారు. ముస్లింలతో కలిసి ఇఫ్తార్ స్వీకరించిన అనంతరం ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని రామచంద్రాపురం ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సీఎన్ కృష్ణ హరీష్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మహాత్మాగాంధీరోడ్డులోని శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ కృష్ణ హరీష్ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతిఏటా ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ప్రకటించిందన్నారు.

మా నమ్మకం నువ్వే జగనన్న అనేది ప్రజల నమ్మకం

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- అట్టహాసంగా కార్యక్రమాల ప్రారంభం



గృహ సారథులు, కన్వీనర్లతో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

విద్యాధరపురం... వించిపేట(విజయవాడపశ్చిమ): 'మా నమ్మకం నువ్వే జగనన్న' అన్నది రాష్ట్ర ప్రజల నుంచి వస్తున్న నినాదనమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం 50వ డివిజన్‌లో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ గృహసారథులు, కన్వీనర్లతో కలసి ఆయన ప్రతి ఇంటిని సందర్శించి గత ప్రభుత్వానికి నేటి జగనన్న ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని వివరిస్తూ వారి అభిప్రాయాలు సేకరించారు. అనంతరం ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేసిన ఇంటి యజమాని అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లను అంటించారు.

14 రోజుల పాటు నిర్వహణ..

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమయ్యే భారీ కార్యక్రమానికి నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును ప్రతి గడపకు తెలియజేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. పార్టీ తరఫున సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి 14 రోజుల పాటు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎన్నో రకాలుగా మంచి చేస్తున్న ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసే కార్యక్రమాలు ప్రతిపక్షాలు చేస్తున్నాయని, వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వీరంతా గత ప్రభుత్వానికి, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య గల వ్యత్యాసాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. అలాగే ప్రభుత్వం పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని, వారి సంతృప్తిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కన్వీనర్లు, గృహ సారథులు ముందుకు సాగాలన్నారు. లబ్ధిదారుల అనుమతితో మొబైల్ ఫోన్లు, ఇళ్లకు స్టిక్కర్‌ను అతికించే కార్యక్రమం చేపట్టాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. వైఎస్సార్ సీపీ 50వ డివిజన్ ఇన్‌చార్జి బంకా విజయ, దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, నాయకులు కొనకళ్ల విద్యాధరరావు, సయ్యద్ అతిక్, బంకా శివ, చాముండేశ్వరి, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న వైద్య నిపుణులు, విద్యార్థులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆరోగ్యమంటే శారీరకంగా, మానసికంగా, సామాజికంగా ఆరోగ్యంగా ఉండటమేనని పలువురు వైద్యులు పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాకేష్ పబ్లిక్ స్కూల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కేఎల్‌రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి వైద్యులు, ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి పి.ఫణీంద్ర, విజయవాడ అధ్యక్షుడు ఎం.ఎ.రెహమాన్, కార్యదర్శి పీవీ. దుర్గారాణి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూర్తి, ఎం.రవీంద్రలతో పాటు స్కూల్ డైరెక్టర్ ఎన్వీ.రావు పాల్గొన్నారు. కేఎల్‌రావునగర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కలరా హాస్పటల్, కేటీ రోడ్డు, పార్కు రోడ్డు, వీఎంసీ కాలనీ మీదుగా సాగింది. అనంతరం స్కూల్ ఆవరణలో వైద్యనిపుణులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. క్లబ్ మాజీ సెక్రటరీ శివకుమార్ పటానాయక్, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆక్యుప్రెజర్ థెరపీ వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజస్థాన్ జోద్‌పూర్‌లోని ఆక్యుప్రెజర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో విజయవాడ బృందావన కాలనీలోని అనంత్ డైమండ్స్ షోరూమ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు షోరూమ్ అధినేతలు భానుప్రకాష్, విష్ణుప్రియలు తెలిపారు. ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే ఈ శిబిరంలో ఆక్యుప్రెజర్ థెరపీస్ట్‌లు డాక్టర్ ధనరాజ్ చౌదరి, డాక్టర్ రేవంత్ చౌదరిలు తమ వైద్య బృందంతో పాల్గొని సేవలు అందిస్తారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు ఆక్యుప్రెషర్, అయస్కాంత చికిత్సలు చేస్తారన్నారు. ఈ శిబిరంలో ప్రతి ఒక్కరూ సేవలను పొందవచ్చునని వివరాలకు 91141 12233 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రజాభిప్రాయ సేకరణకే

'జగనన్నే మా భవిష్యత్'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి, పక్కన ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని ప్రతి ఇంటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ 45 నెలల పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ కోరేందుకే 'జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం భవానీపురంలోని వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా పార్టీ కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షల మంది పార్టీ సైనికులు 1.65 కోట్ల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ పాలనకు వ్యత్యాసం, జగనన్న పాలనలో మంచి జరుగుతుందా లేదా? ప్రజలనే నేరుగా అడిగి తెలుసుకుంటారన్నారు. ప్రజా మద్దతు పుస్తకం ద్వారా ఐదు ప్రశ్నలు ప్రజల ముందుంచడం జరుగుతుందన్నారు. వారి అభిప్రాయాన్ని సేకరించి మద్దతు కూడగడతామని చెప్పారు. ఇంటి యజమాని అంగీకారంతో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను ఇంటికి, సెల్‌ఫోన్‌కు స్టిక్కర్ అంటిస్తామన్నారు. గతంలో చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీ సిఫార్సు ఉన్నవారికి, టీడీపీ వారికి మాత్రమే పథకాలు అందేవన్నారు. జగనన్న పాలనలో పార్టీలు, ప్రాంతాలు, కుల, మత వర్గ బేధం లేకుండా, పార్టీకి ఓటు వేయని వారికి కూడా పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఆ దిశగా అధికారులను ఆదేశించారు.

బాబుకు రామోజీనే దేవుడు

చంద్రబాబుకు రామోజీనే దేవుడని, ఆయన వద్దకు వెళ్లిన సమయంలో బూట్లు, సాక్సులు సైతం తీసివేస్తాడన్నారు. అదే చంద్రబాబు దేవుడు వద్దకు వెళ్లి బూట్లతో పూజలు చేస్తారన్నారు. దేవుళ్లను అవమానించే వ్యక్తులు చంద్రబాబు, అచ్చెంనాయుడు అని అన్నారు. చంద్రబాబు హయాంలో కూల్చిన ఆలయాలను వైఎస్ జగన్ పునర్నిర్మాణం చేస్తున్నారని గుర్తు చేశారు. కాలు నొప్పితో ఒంటిమిట్ట వెళ్లకపోతే దానిని కూడా రాజకీయాలకు వాడుకుని విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. అమరావతి పేరుతో చంద్రబాబునాయుడు విజయవాడ నగర ప్రజలను మోసం చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ నగర సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కృష్ణలంక వరద ముంపు ప్రాంతాల పరిరక్షణకు రిటైనింగ్ వాల్ నిర్మాణమే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు బండి పుణ్యశీల, తోలేటి శ్రీకాంత్, మనోజ్ కొఠారి, గౌస్ మొహిద్దీన్, దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాసరావు, జీఎంసీ బాషా, కార్పొరేటర్లు, డైరెక్టర్లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

నేడు హనుమంతరాయ గ్రంథాలయం పునఃప్రారంభం



మాట్లాడుతున్న దోగిపర్తి శంకరరావు, డాక్టర్ రాంప్రసాద్, దుర్గారావు తదితరులు

విజయవాడకల్చరల్: నగర కళాకారులు, కళాసంస్థల ప్రతినిధుల కోసం గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం, దాని అనుబంధ సంస్థ కళావేదికను ఆధునీకరించి శనివారం నుంచి అందుబాటులో తీసుకువస్తున్నట్లు హనుమంతరాయ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు డోకిపర్తి శంకరరావు తెలిపారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ.. 1934వ సంవత్సరంలో గ్రంథాలయాన్ని స్థాపించారన్నారు. ఇక్కడ అనేక మంది ప్రముఖులు రంగస్థలంపై నాటకాలను ప్రదర్శించారని చెప్పారు. నేటి పరిస్థితులకు అనుగుణంగా అనేక ఆధునిక సౌకర్యాలను ఏర్పాటు చేశామని రెండు నెలల విరామం అనంతరం పునఃప్రారంభిస్తున్నామన్నారు.

సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. శనివారం సాయంత్రం ఏపీ ఫిలిం, టెలివిజన్, థియేటర్ చైర్మన్ పోసాని కృష్ణమురళి, మాజీ పార్లమెంట్ సభ్యుడు మాగంటి మురళీమోహన్ వేదికను ప్రారంభిస్తారన్నారు. ఉపాధ్యక్షుడు సీఏ గద్దం సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ అసోసియేషన్ కార్యదర్శి రావి శారద ప్రారంభిస్తారని చెప్పారు. గ్రంథాలయంలో పరిశోధకులకు అందుబాటులోకి అనేక గ్రంథాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో కార్యదర్శి నీలం దుర్గారావు, కోశాధికారి మహబూబ్ ఆజాం, బెల్లపు బాబ్జి, నందివాడ నాని పాల్గొన్నారు.

వాడవాడలా గుడ్ ఫ్రైడే వేడుకలు



పరిశుద్ధ సిలువ మార్గం ఊరేగింపును ప్రారంభిస్తున్న ఫాదర్ చిన్నప్ప



సిలువ యాత్రలో పాల్గొన్న ఫాదర్ జేమ్స్



సిలువ మార్గం నిర్వహిస్తున్న భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గ వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో పాస్టర్లు, ఫాదర్లు క్రైస్తవులకు క్రీస్తు సందేశాన్ని అందించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు ఆరాధనలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో క్రీస్తు విశ్వాసకులు చర్చిలకు చేరుకుని ప్రార్థనలు చేశారు. సకల మానవాళి పాపాలను ప్రక్షాళన చేసేందుకు ఏసు క్రీస్తు సిలువ ధరించారని, తద్వారా ఆయనను నమ్మిన భక్తులకు మేలు చేకూర్చారని సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చి విచారణ దామాల విజయకుమార్ అన్నారు.

సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవ భక్తులు శుక్రవారం ఉదయం వన్‌టౌన్‌లో భారీ ప్రదర్శనను నిర్వహించారు. క్రైస్తవులు చేతిలో సిలువను ధరించి ఈ ప్రదర్శనలో ముందుకు సాగారు. క్రీస్తు సిలువ ధరించిన గుడ్ ఫ్రైడే యావత్ సమాజానికి అద్భుతమైన సందేశాన్నిందిస్తుందన్నారు. క్రీస్తు బోధనల్లో ప్రధానమైనది ఇతరులకు కీడు తలపెట్టరాదని, సర్వమానవాళిని ప్రేమించమని ఉందన్నారు. దానిని ప్రతి ఒక్కరూ ఆచరించి జీవితాన్ని ధన్యం చేసుకోవాలని కోరారు.

వేలాది మందితో ప్రదర్శన

గుడ్ ఫ్రైడే సందర్భంగా సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చి ఆధ్వర్యంలో వందలాది మందితో ప్రదర్శనను నిర్వహించారు. ప్రదర్శనలో భాగంగా ఏసుక్రీస్తు సిలువ వేసిన విగ్రహాన్ని అందంగా అలంకరించిన వాహనంపై ప్రతిష్టించి ఊరేగింపుగా ముందుకు సాగారు. తారాపేటలోని చర్చి ప్రాంగణం నుంచి ప్రారంభమైన ప్రదర్శన నెహ్రూరోడ్డు, కాన్వెంట్ వీధి, బాబురాజేంద్రప్రసాద్‌రోడ్డు, కేటీరోడ్డు, గులాంమొహిద్దీన్ వీధి, రాయల్‌హోటల్ సెంటర్, పంజా సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా తిరిగి చర్చి ప్రాంగణానికి చేరుకుంది.

జోజినగర్‌లో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): శాంతియుత సమాజం, సన్మార్గ జీవనాన్ని తెలియ చేస్తూ సర్వ మానవాళికి సందేశమిచ్చిన జీసస్ సిలువనెక్కి తన రక్తాన్ని చిందించిన రోజును క్రైస్తవులు గుడ్ ఫ్రైడేగా భావిస్తారని జోజినగర్ చర్చి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప పేర్కొన్నారు. పవిత్ర గుడ్ ఫ్రైడే దినాన్ని పురస్కరించుకుని 45వ డివిజన్ పరిధిలోని జోజినగర్‌లోగల అద్భుత బాల యేసు పుణ్యక్షేత్రం నుంచి శుక్రవారం పరిశుద్ధ సిలువ మార్గం ఊరేగింపును ఆయన ప్రారంభించారు. భారీ ఊరేగింపు బాల ఏసు చర్చి నుంచి స్వాతి రోడ్డు, జాతీయ రహదారి, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు మీదుగా తిరిగి దేవాలయానికి చేరుకుంది. క్షమాగుణం విలువను చెప్పిన జీసస్ ప్రాణత్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే అన్నారు. ఊరేగింపులో 45వ డివిజన్ వైఎస్సార్ సీపీ బాధ్యులు మైలవరపు కృష్ణ, నాయకులు బి.కోటేశ్వరరావు, ముత్యాల రాంబాబు, ముత్తా వాసు, బోర మల్లేశ్వరరెడ్డి, సుంకర నారాయణ, నల్లం వాసు, సంఘస్తులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మార్గం మోక్షదాయకం..

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): ప్రతి ఒక్కరి పట్ల ప్రేమ, కరుణ, సోదరభావంను కలిగి ఉండాలని ఏసుక్రీస్తు చూపిన మార్గం మోక్షదాయకమని పెజ్జోనిపేట ఆర్సీఎం చర్చి ఫాదర్ జేమ్స్ తెలిపారు. చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చేపట్టిన సిలువ యాత్ర పీటర్ వీధి, మసీదు సెంటర్, నాడార్‌వారి వీధి, డేవిడ్ వీధుల మీదుగా సాగింది.

సహాయక గురువులు జేస్టిన్, చౌరి, మ్యాథ్యూస్, సంగ పెద్దలు మరియన్న, చిన్ని, జోషఫ్, పీటర్, శరత్ పాల్గొన్నారు.

మేరీమాత పుణ్యక్షేత్రంలో..



ఏసుక్రీస్తు సందేశాన్నిస్తున్న ఫాదర్లు

గుణదల(విజయవాడతూర్పు): సర్వ మానవ పాప పరిహారార్థమే ఏసుక్రీస్తు సిలువ యాగం జరిగిందని దివ్యవాణి చానల్ కో ఆర్డినేటర్ ఫాదర్ బుర్రి జాన్ పీటర్ అన్నారు. సుప్రసిద్ధ గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రధానాలయం వద్ద నుంచీ కొండ శిఖరాగ్రం వరకు సిలువ మార్గం నిర్వహించారు. ఏసుక్రీస్తును సిలువ వేసిన సందర్భాన్ని మననం చేసుకుంటూ వందలాది మంది క్రైస్తువులు కాలి నడకన గుణదల కొండకు పోటెత్తారు. సిలువ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ జాన్ పీటర్ దైవ సందేశాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ, మానవ రక్షణార్థమై ఏసుక్రీస్తు మానవ రూపిగా ఈ లోకానికి అరుదెంచారని తెలిపారు. మానవుల పాప క్షమాపణ నిమిత్తమై ఏసుక్రీస్తు సిలువ మరణం పొందారని బోధించారు. ఆయన చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. మధ్యాహ్నం పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో సమష్టి దివ్యబలి పూజ నిర్వహించారు. సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్ రాజు సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, లయోల కళాశాల రెక్టర్ ఫాదర్ బాలసౌరి, ఫాదర్లు కొలగాని మరియన్న, జి.నరేష్, సహాయ గురువులు ఫాదర్లు వినోద్, యశ్వంత్ పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): శ్రీ రామనవమి వేడుకల్లో భాగంగా కృష్ణలంక, పాత పోలీస్ స్టేషన్ రోడ్డులోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో శుక్రవారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో మహిళలు విశేషంగా పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ ఈఓ అనురాధ పర్యవేక్షించారు. శనివారం ఉదయం స్వామి వారి ఊరేగింపు, సాయంత్రం 6.30 గంటలకు పవళింపు సేవ జరుగుతుందన్నారు. భక్తులందరూ పాల్గొనాలని ఆలయ అర్చకులు కోరారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటి ముంగిటకే వైద్య సేవలు

- వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ యాదవ్



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఫ్యామిలీ డాక్టర్ ద్వారా వినూత్నంగా గడప వద్దకే వైద్యసేవలు అందించటం ద్వారా ప్రజల ఆయుఃప్రమాణం పెరుగుతుందని వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అంబటి వెంకట రాధాకృష్ణ యాదవ్ తెలిపారు. స్థానిక ముత్యాలంపాడులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్ విద్య వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్‌తో దీర్ఘకాలిక వ్యాధులతో పాటు నిరుపేదలకు సైతం నాణ్యమైన వైద్యసేవలు అందుతాయన్నారు. అలాగే అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ పథకం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఇప్పటికే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజల మనస్సులలో స్థానం సంపాదించుకోగా ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ ద్వారా తండ్రిని మించిన తనయుడిగా పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

కనులపండువగా ఆది దంపతుల నదీ విహారం



నదీ విహారంలో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి



కృష్ణ నది వద్ద పంచ హారతులిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): గంగా పార్వతి(దుర్గా) సమేత మల్లేశ్వర స్వామి వార్ల నదీ విహారం శుక్రవారం కనులపండువగా సాగింది. చైత్రమాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ ఏడాది ఆది దంపతులకు నదీ విహారం ఏర్పాటు చేశారు. తొలుత మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల వద్ద స్వామి వార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు ప్రారంభించారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ ఆది దంపతులకు పూజలు నిర్వహించి నదీ విహారానికి పయనమయ్యారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు దుర్గాఘాట్‌కు చేరుకుంది. పూలతో అలంకరించిన బోటుపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆది దంపతులను ఉంచి పూజలు చేశారు.

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణులతో పాటు చైర్మన్, ఈఓ తదితర ముఖ్య అధికారులు బోటుపైకి చేరుకున్నారు. స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు ఎల్‌డీ ప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, యజ్ఞనారాయణ శర్మ, ఇతర అర్చకులు పూజలు నిర్వహించారు.

మూడు సార్లు నదిలో ప్రదక్షిణగా తిరిగి దుర్గాఘాట్‌కు చేరుకుంది. పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, చింతా సింహాచలం, చింకా శ్రీనివాసరావు, నంబూరి రవి, బచ్చు మాధవీకృష్ణ, కేసరి నాగమణి, నిడమానూరి కళ్యాణి, అల్లూరి కృష్ణవేణి, తొత్తడి వేదకుమారి, దుర్గగుడి అధికారులు, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, వన్‌టౌన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సీతారాముల నగరోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం డౌన్ సీతారాముల కళ్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారాముల నగరోత్సవం కనుల పండువగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో సీతారాములను ఉంచి మేళతాళాలు డప్పు వాయిద్యాలతో ఊరేగింపు చేపట్టారు. దారి పొడవునా భక్తులు సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కంచర్ల రాము పర్యవేక్షించారు, మధురానగర్ నేతాజీ కాలనీలో శుక్రవారం సీతారాముల కళ్యాణోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు, కార్యక్రమాలను నిర్వాహకులు శ్రీను పర్యవేక్షించారు.